# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 15-03-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- పరిపాలనలో సంస్కరణలు తేవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- కాలుష్య నివారణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.
- కేంద్ర ప్రభుత్వ అమృత్ పథకం ద్వారా మున్సిపాలిటీల్లో నీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.
- గిరిజనులకు అన్ని విధాలుగా రాష్ట్ర ప్రభుత్వం అండగా వుంటోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు.

========================

పరిపాలనలో సంస్కరణలు తేవాలన్నదే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో ముఖ్యమంత్రి ఈ రోజు పర్యటించారు. స్థానిక ఎన్టీఆర్ పార్క్ వద్ద పారిశుద్ధ్య కార్మికులతో ముఖాముఖిలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో మాట్లాడుతూ... స్వచ్ఛాంధ్ర కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే పరిసర ప్రాంతాలన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. "పేదల పింఛన్లు 3 వేల నుంచి 4 వేల రూపాయలకు, దివ్యాంగుల పింఛన్ 3 వేల నుంచి 6 వేల రూపాయలకు పెంచామన్నారు. స్వర్ణాంధ్ర 2047 పేరుతో ఒక స్పష్టమైన విధానం తీసుకొచ్చామని ముఖ్యమంత్రి మాట్లాడుతూ...

(వాయిస్ 37 సెకన్లు)

========================

కాలుష్య నివారణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ఆయన

పాల్గొన్నారు. గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో "గుంటూరు నగరానికి ప్లాస్టిక్ నుంచి విముక్తి కల్పిద్దాం." పేరిట నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి మాట్లాడుతూ... భావితరాలు క్యాన్సర్ నుండి విముక్తి పోందాలంటే ప్లాస్టిక్ ను వినియోగించరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, పౌరులతో పరిశుభ్రతపై ఆయన ప్రతిజ్ఞ చేయించారు.

========================

నగరపాలక సంస్థల్లో మౌలిక వసతుల ఏర్పాటు కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర రవాణా, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటి మునిసిపాలిటీలో కోటి 60 లక్షల రూపాయలతో నిర్మించనున్న పైప్ లైన్, రహదారులు, డ్రైనేజీలకు మంత్రి ఈరోజు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ అమృత్ పథకం ద్వారా మున్సిపాలిటీల్లో నీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా సిసి రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 34 సెకన్లు)

========================

మంగళగిరిని అభివృద్ధి చేసేందుకు కలిసికట్టుగా పని చేయాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళగిరిలో పారిశుద్ధ్య కార్మికులతో ఈ రోజు ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య నిర్వహణలో స్పష్టమైన మార్పు కనిపిస్తోందన్నారు. పారిశుద్ధ్యం, స్వచ్ఛతలో దేశంలోని అన్ని కార్పొరేషనల్లో మంగళగిరిని మొదటి స్థానంలో నిలబెట్టలానేది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దీనికి పారిశుద్ధ్య కార్మికులతో పాటు ప్రజలు కూడా సహకరించాలని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు.

========================

ఈనెల 17వ తేదీ నుండి జరగనున్న పదవ తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ రోజు క్యాంపు కార్యాలయం నుండి వివిధ శాఖల అధికారులతో పరీక్షల నిర్వహణపై శ్రవణ మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పరీక్షా కేంద్రంలో మాస్ కాపీయింగ్ జరిగిందని తెలిసిన తక్షణమే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విరామం

========================

గిరిజనులకు అన్ని విధాలుగా రాష్ట్ర ప్రభుత్వం అండగా వుంటోందని మహిళా, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో ఏర్పాటు చేసిన గిరి బజార్ ను ఆమె ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... సంతల్లో విక్రయించే కల్తీ సామాగ్రి బారిన పడకుండా నాణ్యమైన సరకులను గిరిజనులకు అందుబాటులో వుంచేందుకు ఈ గిరి బజార్" ను ఏర్పాటు చేశామన్నారు. ఈ బజారులో అన్ని నిత్యావసర వస్తువులు అందుబాటు ధరల్లో ఉంటాయని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

========================

పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందించడం జరుగుతుందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఈరోజు సాలూరు పట్టణంలో గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థులకు

పరీక్షా సామాగ్రిని ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ బాగా చదువుకోవాలని, పరీక్షలు బాగా రాయాలని మంత్రి ఆకాంక్షించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎటువంటి సదుపాయాల లోపం లేకుండా చూడాలనేది ప్రభుత్వ ధ్యేయమని, త్వరలో అన్ని బాలికల ఆశ్రమ పాఠశాలల్లో వేడి నీరు సరఫరా జరిగే విధంగా చర్యలు చేపడతామని మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు.

========================

పార్వతీపురం మన్యం జిల్లాలో వున్న 34 పరీక్షా కేంద్రాలలో ఈరోజు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులకు కెమిస్ట్రీ-2, కామర్స్-2, ఒకేషనల్ విద్యార్థులకు బ్రిడ్జి కోర్స్ మాథ్స్-2, బయోలాజికల్ సైన్స్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిణి మంజుల వీణ పేర్కొన్నారు. జిల్లాలో జనరల్, ఒకేషనల్, ప్రైవేట్ విద్యార్థులతో కలిపి మొత్తం 6 వేల 184 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. 5 వేల 948 మంది విద్యార్థులు హాజరయ్యారని, 236 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆమె వెల్లడించారు.

========================

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల మూడో శనివారం చేపడుతున్న స్వర్ణఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర లో భాగంగా పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు రాజుపాలెం మండలం, నెమలిపురిలో ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ పునర్వినియోగ వస్తువులను ప్రోత్సహించాలన్నారు. సచివాలయం సిబ్బంది జూట్ బ్యాగులను వినియోగించాలని  ఆయన  కోరారు.

అలాగే పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని అనకాపల్లి జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణ రావు పేర్కొన్నారు. ఈ రోజు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన "స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛఆంధ్ర... కార్యక్రమంలో సిబ్బందితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ...తడి, పొడి చెత్తను వేరుచేసే విధానంపై సిబ్బందికి అవగాహన కల్పించారు.

========================

విశాఖలోని ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానం ఇండియన్ ప్రీమియర్ లీగ్  (ఐపీఎల్) మ్యాచ్ లకు  మరోసారి వేదిక కానుంది. ఈ నెల 24వ తేదీన ఢిల్లీ-లఖ్‌నవూ, 30వ తేదీన ఢిల్లీ-హైదరాబాద్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ లు జరగనున్నాయి. ఈ సందర్బంగా మైదానంలో అత్యాధునిక సదుపాయాలు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. సంవత్సరం తర్వాత జరగనున్న ఈ ఐపీఎల్ మ్యాచ్‌ల కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

========================

ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు, సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు పారదర్శకంగా జరగాలని  పాఠశాల, ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి, తిరుపతి జిల్లా ఇన్‌చార్జి అధికారి కోన శశిధర్ అధికారులను ఆదేశించారు. ఈ రోజు కలెక్టర్ కార్యాలయంలో శ్రవణ మాధ్యమం ద్వారా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జిల్లా అభివృద్ధికి అధికారులు అందరూ చిత్తశుద్ధితో కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో పారిశ్రామిక, పర్యాటక, ఆతిథ్య రంగం వంటి పలు రంగాలలో విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

========================
========================